

మంచిర్యాలలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో పోలింగ్ కోసం ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

# ఎన్నికలకు అంతా సిద్ధం

- మంచిర్యాల నియోజక వర్గంలో 287 పోలింగ్ స్టేషన్‌లు
- 2,74,807 మంది ఓటర్లు
- అన్ని ఏర్పాట్లు చేశాం
- ఆర్డీవో రాములు



గర్మిళ్ల : మంచిర్యాలలో ఈవీఎంల తరలింపు కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది

మంచిర్యాల అర్బన్, నవంబర్ 29 : ఈ నెల 30న మంచిర్యాల నియోజక వర్గంలో జరిగే శాసన సభ ఎన్నికలకు అధికారులు అంతా సిద్ధం చేశారు. నియోజక వర్గంలో దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్, మంచిర్యాల, నస్పూర్ మండలాలు ఉండగా 2,74,807 (పురుషులు 1,36,760, మహిళలు 1,38,022, ట్రాన్స్‌టెండర్లు 25) మంది ఓటర్లు ఉన్నారు. నియోజక వర్గంలోని ఐదు మండలాల్లో 287 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల నిర్వాహణ అధికారులు ఏర్పాటు చేశారు.

**అన్ని ఏర్పాట్లు చేశాం - రాములు, ఆర్డీవో**

నియోజకవర్గంలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. రూట్ వైజ్‌గా బస్సులు ఏర్పాటు చేశాం. బస్సులు వెళ్లలేని కుందేళ్ల పహాడ్, తలమల పీఎస్‌లకు టాటా ఏస్ వాహనాలను ప్రత్యేకంగా ఉంచాం. వీటిని పరిశీలించేందుకు సెక్టర్ ఆఫీసర్లను నియమించాం. టెక్నికల్ సమస్యతో ఈవీఎంలు మొరయిస్తే వెంటనే మరమ్మతులు చేయడానికి మూడు టీంలను ఏర్పాటు చేశాం.

**పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది.**

దండేపల్లి, నవంబర్29: మండలంలోని 49 పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది ప్రత్యేక బస్సులలో ఓటింగ్ యంత్రాలతో చేరుకొన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంటాయని అధికారులు తెలిపారు.

**లక్షెట్టిపేటలో..**

లక్షెట్టిపేట, నవంబర్ 29: మండలంలో మొత్తం మున్సిపాలిటీని కలుపుకుని 47పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఒక్కో కేంద్రంలో నలుగురు పోలింగ్ సిబ్బందితో పాటు ఒక మైక్రో అబ్జర్వర్‌ని కేటాయించినట్లు తహసీల్దార్ రాఘవేంద్ర రావు తెలిపారు. మండలంలో మొత్తం 42082మంది ఓటర్లున్నారనీ, పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. రామగుండం సీపీ ఆదేశాల మేరకు లక్షెట్టిపేట సీఐ కృష్ణ ఎస్ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలో 112 మంది పోలీసు సిబ్బందితో ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారని డీఎస్పీ, ఇద్దరు సీఐలు పర్యవేక్షిస్తున్నారని ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. ఒక్కో పోలింగ్ కేంద్రం ఎన్నికల సిబ్బందితో పాటు ఒక పీసీని కేటాయించామని కాంప్లికేటెడ్ కేంద్రాల్లో పోలీసుల పహారా సంఖ్య పెంచామన్నారు.

**ఈవీఎం పంపిణీ కేంద్రం పరిశీలన**

గర్మిళ్ల, నవంబర్ 29 : జిల్లా కేందంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల పంపిణీ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బాదవత్ సంతోష్, పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి పరిశీలించారు. పోలింగ్ సజావుగా నిర్వహించాలని, అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చూడాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు.

**పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది తరలింపు**

మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ ఎన్నికలు రేపు జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల సిబ్బందికి బుధవారం సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల పంపిణీ కేంద్రంలో పోలింగ్ సిబ్బందికి ఈవీఎంలు వీవీ ప్యాట్ యంత్రాలతో పాటు ఇతర సామగ్రిని అధికారులు అందజేశారు. అధికారులు బస్సులను ఏర్పాటు చేశారు.



లక్షెట్టిపేట : జెండవెంకటాపూర్ పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

**జన్నారం మండలంలో..**

జన్నారం, నవంబర్ 29 : ఖానాపూర్ నియోజకవర్గంలోనిజన్నారంమండలంలోని54 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 42,720 వేల మంది ఓటర్లున్నారు. పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని తెలిపారు.

# అభివృద్ధే గెలుపు మంత్రం

- రూ. 1500 కోట్ల అభివృద్ధి పనులు
- 1,49,494 మంది లబ్ధిదారులకు చేరువైన పథకాలు
- మారిన మంచిర్యాల రూపురేఖలు



మంచిర్యాల పట్టణంలోని జంక్షన్

మంచిర్యాలటౌన్, నవంబర్ 29: మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి దివాకర్ రావు అభివృద్ధే ధ్యేయంగా కృషి చేశారు. రూ. 1500 కోట్ల విలువైన అభివృద్ధి పనులతో పాటు దాదాపు లక్షన్నర మంది లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు చేరవయ్యాయి. మంచిర్యాల జిల్లా కావాలనే కలను తెలంగాణ సర్కార్ నెరవేర్చింది. హాజీపూర్, నస్పూర్ కొత్త మండలాలను, ఆ తర్వాత లక్షెట్టిపేట, నస్పూర్‌ను కొత్త మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేసింది. కలలో కూడా ఎవ్వరూ ఊహించని విధంగా మంచిర్యాలకు మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీలు వచ్చాయి. రూ.55 కోట్లతో కలెక్టరేట్‌కు అద్భుత సౌధం నిర్మితమైంది. రూ. 510 కోట్లతో మెడికల్ కళాశాలను నిర్మిస్తున్నారు. నియోజకవర్గ కేంద్రానికి తూర్పున ఉన్న శ్రీరాంపూర్ నుంచి చెన్నూరు నియోజకవర్గంలోని గద్దెరాగడికి ఓఆర్ఆర్ రావడంతో మంచిర్యాల రూపురేఖలు పూర్తిగా మారిపోయింది.

**రూ.1500 కోట్ల అభివృద్ధి పనులు..**

నియోజకవర్గంలో గడిచిన పదేళ్లలో రూ.1500 కోట్లతో 9406 అభివృద్ధి పనులు చేశారు.

- మంచిర్యాలలోరూ.12 కోట్లతో బైపాస్ రోడ్డు వేశారు. సీసీ రోడ్డును వెడల్పు చేసి సెంట్రల్ లైటింగ్ పెట్టారు.
- రూ.15 కోట్లతో మంచిర్యాల వన్ టౌన్, టూ టౌన్ మధ్య రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించారు.
- రూ.55 కోట్లతో పాత మంచిర్యాల నుంచి ఇందారం క్రాస్‌రోడ్డు దాకా ఆరు వరుసల రహదారి, సెంట్రల్ లైటింగ్ వచ్చింది.
- గ్రామీణ ప్రాంతాల్లో రవాణా వ్యవస్థను మెరుగుపరిచారు. దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల పరిధిలో గ్రామాల్లో రూ.290.93 కోట్లతో 4468 సీసీరోడ్లు, రూ. 78.92 కోట్లతో 1688 డ్రైనేజీలు, రూ.87.11 కోట్లతో 111 బీటీ రోడ్లు, రూ.7.63 లక్షలతో 11 వంతెనలు నిర్మించారు.
- మంచిర్యాల పాత మార్కెట్ కమిటీ ఆవరణలో మెడికల్ కాలేజీ అనుబంధ 380 పడకల ప్రభుత్వ దవాఖాన, నర్సింగ్ కాలేజీ నిర్మాణ పనులు సాగుతున్నాయి.
- మంచిర్యాల, నస్పూర్, లక్షెట్టిపేటలో రూ.12.23 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు నిర్మిస్తున్నారు.
- రూ.164కోట్లతో మంచిర్యాల – అంతర్గాం ల మధ్య గోదావరి నదిపై హైలెవెల్ వంతెనను నిర్మిస్తున్నాం. పనులు సాగుతున్నాయి
- రూ. 35 కోట్లతో మంచిర్యాల ఐబీ చౌరస్తా నుంచి శ్రీనివాస టాకీసు దాకా ఆరు వరుసల రహదారి నిర్మించారు. రంగంపేట దగ్గర రూ.12కోట్లతో హైలెవెల్ వంతెనకు నిధులు మంజూరయ్యాయి. మూడు మున్సిపాలిటీల్లో రూ.75 కోట్ల ఎస్‌డీఎఫ్ (సీఎం హామీ) నిధులతో విరివిగా పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.
- ప్రస్తుతం మంచిర్యాల టౌన్‌లో రూ.15కోట్లతో ఐదు సెంటర్లలో రహదారుల విస్తరణ పనులు చేపడుతున్నారు. రూ.2 కోట్లు వెచ్చించి మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అదనపు తరగతి గదులు నిర్మించారు. రూ.17కోట్లతో మంచిర్యాలలో మాతా శిశు దవాఖానను నిర్మించారు. రూ.8 కోట్లతో లక్షెట్టిపేటలో 30 పడకలదవాఖానను నిర్మిస్తున్నారు.

**పద్దనపల్లి లిఫ్ట్‌తో సస్యశ్యామలం దిశగా...**

గోదావరి పక్కనే ఉన్నా గత పాలకుల నిర్లక్ష్యంతో మంచిర్యాలకు నీళ్లు రాలేదు. హాజీపూర్ మండలం పద్దనపల్లిలో రూ.80.50 కోట్లతో ఒక టీఎంసీ సామర్థ్యంలో లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు భూమిపూజ సైతం చేశారు. ఇది అందుబాటులోకి వస్తే దాదాపు 8 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. దీంతో పాటు ఇరిగేషన్ శాఖ నుంచి రూ.34 కోట్లతో 4వ కడెం డిస్ట్రిబ్యూటరీ కాలువ లైనింగ్ పనులు చేపడుతున్నారు. దీని ద్వారా దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో 20వేల ఎకరాలకు నీరు అందుతుంది. తెలంగాణ వచ్చాక 2015లో పూర్తి చేసిన గూడెం లిఫ్ట్ ఇరిగేషన్‌తో దండేపల్లి, లక్షెట్టిపేట్, హాజీపూర్ మండలాల్లో దాదాపు 30 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. పద్దనపల్లి పూర్తయితే నియోజకవర్గం మొత్తం కవర్ కానున్నది. మిషన్ భగీరథ కింద మంచిర్యాల పట్టణంలో రూ.59కోట్లతో అర్బన్ పనులు పూర్తి చేశారు. మరో పది శాతం పనులు పూర్తయితే పట్టణానికి పూర్తిస్థాయిలో భగీరథ నీరందే అవకాశాలు ఉన్నాయి.

**సింగరేణి ఇండ్ల పట్టాలు..**

నియోజకవర్గంలోని నస్పూర్–శ్రీరాంపూర్ ఏరియాల్లో సింగరేణి స్థలాల్లో ఇండ్లు కట్టుకున్న 3500 మందికి పట్టాలు ఇచ్చారు. మరో 4500 మందికి కారుణ్య నియామకాలు వచ్చాయి. నస్పూర్ మున్సిపాలిటీలో ఎన్‌హెచ్–63 జాతీయ రహదారి నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. మంచిర్యాల ఐటీఐ ప్రాంగణంలో నైపుణ్యాభివృద్ధి అండ్ శిక్షణ కేంద్రం నిర్మిస్తున్నారు. ఇవే కాకుండా విద్యాపరంగా కస్తూర్బా, బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలలు, ఆదర్శ విద్యాలయాలు, మైనార్టీ గురుకుల పాఠశాలలు, మహిళా డిగ్రీ కళాశాల, కేంద్రీయ విద్యాలయం, సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలను తీసుకువచ్చారు. మన ఊరు–మన బడి కార్యక్రమం కింద ప్రభుత్వ బడులను బాగు చేస్తున్నారు.

**మంచిర్యాల నియోజకవర్గంలో అందిన సంక్షేమం..**

- **ఐటీ హబ్, ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటుచేస్తాం**

మంచిర్యాలలో ఐటీ హబ్‌తోపాటు ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటుచేసి తీరుతాం. ఈ విషయాన్ని మంత్రి కేటీఆర్ వచ్చినపుడు కోరగా ఆయన వెంటనే మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. గోదావరి, రాళ్లవాగులతో వర్షాకాలం వరద నీరు మంచిర్యాల, నస్పూర్‌లో ఇండ్లలోకి వస్తుంది. దానికి శాశ్వత పరిష్కారాన్ని చేయనున్నాం. రాళ్లవాగు, గోదావరి నదులకు కరకట్టలను నిర్మించి ఇండ్లలోని నీరు రాకుండా చేయాలని కోరగా ఈ నెల 24న ముఖ్యమంత్రి కేసీఆర్ మంచిర్యాలకు వచ్చిన సందర్భంగా స్పష్టమైన హామీ ఇచ్చారు. మళ్లీ ప్రభుత్వ బాధ్యతలు చేపట్టిన వెంటనే కరకట్టలు నిర్మించి చుక్కనీరు ఇండ్లలోకి రాకుండా చేస్తామని చెప్పారు. మరోపక్క అంతర్గాం వైపు గోదావరి నదిపై వంతెన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. రూ. 164 కోట్లతో ఈ వంతెనను నిర్మించనున్నారు. పాత మంచిర్యాల నుంచి ఇందారం క్రాస్ వరకు, ఐబీ చౌరస్తానుంచి శ్రీనివాస గార్డెన్ వరకు రోడ్డు వెడల్పు పనులు, సెంట్రల్ మీడియన్ పనులు జరుగుతున్నాయి. మంచిర్యాల పట్టణంలో రూ. 12కోట్లతో రాళ్లవాగుపై హైలెవెల్ వంతెన నిర్మాణానికి మంజూరు లభించింది. రైల్వే అండర్‌బ్రిడ్జిని నిర్మించాం. బస్తీదవాఖానాలు ఏర్పాటు చేశాం. గూడెం, పద్దనపల్లి ఎత్తి పోతల పథకాలతో వ్యవసాయం సస్యశ్యామలం కానుంది. డిగ్రీ, జూనియర్ కాలేజీల్లో అదనపు తరగతి గదులను నిర్మించాం.ప్రతిపక్ష నాయకులు ఎన్ని తప్పుడు మాటలు చెప్పినా ప్రజల ఆశీర్వాదం నా వైపే ఉన్నది.

**- నడిపెల్లి దివాకర్‌రావు, ఎమ్మెల్యే, మంచిర్యాల**

## బట్టబయలైన మంచిర్యాల కాంగ్రెస్ అభ్యర్థి భాగోతం

- **అఫిడవిట్‌లో చూపించని ఆస్తులతో చిక్కులు**

మంచిర్యాల అర్బన్, నవంబర్ 29 : మంచిర్యాల కాంగ్రెస్ అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుకు మొదటి నుంచి గుండా, రౌడీ.. అనే ప్రచారమే అధికంగా సాగుతుండగా తాజాగా మరో విష యం వెలుగులోకి వచ్చింది. ఎన్నికల అఫిడవిట్‌లో మలేషియాలో ఆస్తులు వివరించకపోవడంతో అనర్హత వేటు పడే అవకాశం ఉందనే వీడియో వైరల్ అవుతుండడంతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. పోలింగ్‌కు ముందే ఈ విషయాలు బయటపడటంతో అనర్హత వేటు పడుతుందా! లేదా! అనే విషయం తేలాల్సి ఉంది.

**వైరల్ అవుతున్న వీడియో క్లిప్...**

టాప్ తెలుగు టీవీలో ప్రేంసాగర్ రావు పేరిట ఒక వీడియో నియోజకవర్గంలో హల్ చల్ చేస్తుంది. ఇందులో పీఎస్ఆర్ దందాలను వి వరించింది. భూ కబ్జాలు, ల్యాండ్ సెటిల్‌మెంట్లు, మద్యం, గం జాయి, డ్రగ్స్ దందాలకు పాల్పడుతూ, పేకాట క్లబ్బులు నడుపుతూ దోచుకున్న వందలాది కోట్లతో మలేషియాలో 300 ఎకరాలు, రూ.32 కోట్ల విలువైన భవనం, బీఎండబ్ల్యూ కార్లు తదితర అక్రమ ఆస్తుల వివరాలు ఎన్నికల అఫిడవిట్‌లో చూపించకపోవడం, అది ఇప్పుడు భయటపడటంతో అంతటా ఈ న్యూసే వైరల్ అయ్యింది. ఏ నలుగురు కనబడ్డా ఈ అక్రమ ఆస్తుల గురించే చర్చిస్తున్నారు. మంచిర్యాల నుంచి మాఫియా మలేషియాకు పాకిందనే వార్త దావానంలా వ్యాపించింది. పొరపాటునా పీఎస్ఆర్ గెలిస్తే నియోజక వర్గంలో ఈ ఆక్రమణలు, అక్రమాలు మరింత పెరుగుతాయని, ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని మాట్లాడుకోవడం కనిపించింది.

## పోలింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలి



జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్,నవంబర్ 29 : ఎన్నికల్లో పోలింగ్ ప్రక్రియ అతి ప్రధానమైదని, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసి సీసీ టీవీ సర్వేయలెన్స్, జీపీఎస్ సర్వేయలెన్స్, కంట్రోల్ రూమ్, వెబ్‌కాస్టింగ్, సోషల్ మీడియా సెల్‌లను జిల్లాపరిశీలకులు ఇలంగో, అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా జిల్లాలో ప్రత్యేక బృందాల ద్వారా పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.